గురుకుల పాఠశాలల అభివృద్ధికి కృషి

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు 100 రకాల నమూనాలను ఇక్కడ ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన నమూనాలను జాయింట్ కలెక్టర్ జాహ్నవితో కలిసి ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన పర్యావరణ రహిత గ్రామాల నిర్మాణం, సోలార్ విద్యుత్తు తయారీ, తాగునీటిని శుద్ధి చేసే ప్రాజెక్టు నమూనాలను పరిశీలించారు. జాతీయస్థాయిలో రాణించే విధంగా విద్యార్థులు ప్రాజెక్టులను తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డీఈవో వెంకటలక్ష్మమ్మ కోరారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎం.మాణిక్యం, డీవైఈవో అప్పారావు, జనసేన, తెదేపా నాయకులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కౌన్సెలర్ మజ్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు



పెరిగిన దిగుమతి.. అందుబాటులోకి టమాటా

నక్కపల్లి, న్యూస్‌టుడే: రెండు వారాలుగా ఎగబాకుతూ వస్తున్న టమాటా ధరలు ప్రస్తుతం దిగొస్తున్నాయి. గత వారం కేజీ రూ.100 పలకడంతో వినియోగదారులు తారెత్తిపోయారు. నక్కపల్లిలో శుక్రవారం జరిగిన సంతలో కేజీ రూ.60కే విక్రయించారు. దిగుబడులు పెరగడంతో ధరలు తగ్గినట్లు వ్యాపారులు వెల్లడించారు. దీంతో వినియోగదారులు ఊరట చెందారు మిగిలిన కూరగాయ ధరలు మాత్రం యథాతథంగా ఉన్నాయి. ఉల్లి నాణ్యతను బట్టి కేజీ రూ.50 నుంచి రూ.60 వరకు ఉంది. చిక్కుళ్లు, ఆగాకర రూ.120, బెండ, వంకాయ, గోరుచిక్కుడు రూ.60, దొండ రూ.50, బంగాళ దుంపలు రూ.40 పలికాయి.

జీసీసీ సేవలు విస్తరిస్తాం.. జీవనోపాధికి దారి చూపుతాం

అరకు కాఫీ, జీసీసీ ఉత్పత్తుల స్టాళ్లకు ఫ్రాంచైజీలిస్తాం

'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్'తో ఎండీ కల్పనాకుమారి

–ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, పెదవాల్తేరు

'అరకు కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. ప్రధాని మోదీ మన్‌కీబాత్‌లో ఈ కాఫీ గొప్పతనం ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు కూడా అరకు కాఫీ, కాఫీ విస్తరణపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో జీసీసీ సేవలు మరింత విస్తరించే ప్రణాళికలు అమలు చేస్తున్నాం. వాటితో గిరిజనుల జీవనోపాధి మెరుగవుతుంద'ని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఎండీ కల్పనాకుమారి వెల్లడించారు. అటవీ ఉత్పత్తుల సేకరణ నుంచి వాటి బ్రాండింగ్, మార్కెటింగ్ వరకు తీసుకువస్తున్న మార్పుల గురించి 'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్'కు ఆమె వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..


కల్పనాకుమారి, జీసీసీ ఎండీ



ఆకర్షణీయ ప్యాకింగ్‌లో..

జీసీసీ లోగో నుంచి ప్యాకింగ్ వరకు అన్నింటిని మార్పులు చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయిలో ఆకట్టుకునేలా ఆకర్షణీయంగా జీసీసీ ఉత్పత్తుల ప్యాకింగ్ ఉండబోతోంది. ఈ మేరకు మార్కెటింగ్ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం. త్వరలోనే సరికొత్త ప్యాకింగ్‌తో కాఫీ, తేనె, పసుపు, చింతపండు, సబ్బులు, షర్బత్, నన్నారీ ఇలా 50 రకాలపైగా మా ఉత్పత్తులు మార్కెట్‌లోకొస్తాయి.

మరిన్ని రుచుల్లో కాఫీ

జీసీసీ నుంచి అరకు కాఫీ అమ్మకాలకు ఫ్రాంచైజీలు ఇవ్వనున్నాం. అన్నిచోట్లా ఒకేలా ఏర్పాటు చేసేలా ఓ నమూనాను తయారు చేస్తున్నాం. వీటి కోసం ముందుకొచ్చేవారికి అరకు కాఫీ తయారీపై శిక్షణ ఇస్తాం. ఇప్పటికే విశాఖతో పాటు రాష్ట్రంలోని ముఖ్య ప్రాంతాల నుంచి ఫ్రాంచైజీలు కోసం చాలామంది సంప్రదిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌స్టెంట్, ఫిల్టర్ కాఫీలు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో మరిన్ని రుచుల్లో కాఫీని తీసుకువచ్చే విధంగా డికెఫెనేటెడ్ కాఫీని తీసుకురావాలనే ఆలోచనతో ఉన్నాం. మార్కెటింగ్ కోసం పొరుగుసేవల ద్వారా సిబ్బందిని నియమించుకుంటాం.



స్థానికంగానే ప్రాసెసింగ్ యూనిట్లు..

ఇదివరకు కాఫీ, ఇతర అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని శుద్ధి చేయడానికి, విలువ జోడించడానికి ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నాం. ఇకపై స్థానికంగానే వాటిని ప్రాసెస్ చేయాలని నిర్ణయించాం. అనకాపల్లి సమీపంలో కొత్తగా కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయబోతున్నాం. వచ్చే ఐదేళ్లలో 8 వేల టన్నుల నుంచి 10 వేల టన్నుల సరకు సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నాం. ఈ ఏడాది నుంచే 2000 వేల టన్నుల సేకరణ మొదలుపెడుతున్నాం. కాఫీతో వివిధ ఉత్పత్తులను తయారు చేయాలనే ఆలోచన ఉంది. రంపచోడవరంలో ఇప్పటికే మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ పెట్టాం. ఈ నెలాఖరులోగా వినియోగంలోకి తెస్తాం. పసుపు పంటకు విలువ జోడించి మార్కెటింగ్ చేస్తాం.


పారదర్శకతకు పెద్దపీట..

జీసీసీ ద్వారా ఏటా రూ.500 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. కాకపోతే సిబ్బంది, ఉద్యోగుల్లో జవాబుదారీతనం లోపించడంతో కొన్నిచోట్ల అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని జీసీసీ లావాదేవీలు మొత్తం ఆన్‌లైన్ చేయనున్నాం. ఏరోజు ఎక్కడ ఎంత అమ్మకాలు జరిగాయి?, నగదు జమైందా?, నిల్వలు ఎంతున్నాయి.. లాంటి సమాచారం క్షణాల్లో తెలుసుకునే ఏర్పాటు చేస్తున్నాం. జీసీసీలో ఖాళీ పోస్టులను డిప్యుటేషన్ల ద్వారా భర్తీ చేస్తున్నాం. ఇది వరకు అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేశాం. బాధ్యులుగా గుర్తించిన కొంతమంది నుంచి రికవరీలు చేశామ'ని ఎండీ కల్పనాకుమారి తెలిపారు.



28 నుంచి బాలల ప్రతిభాపాటవ పోటీలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి జిల్లా స్థాయి బాలల ప్రతిభాపాటవ పోటీలు జరగనున్నాయి. వీటికి సంబంధించిన ప్రచార ప్రతులను శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నంలో శుక్రవారం ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజే నాథ్ మాట్లాడుతూ.. 28న చిత్రలేఖనం, 29న జూనియర్స్, 30న సీనియర్స్ విభాగాల్లో దేశభక్తి గీతాల పోటీ, నవంబరు 2న సబ్ జూనియర్స్‌, 4న జూనియర్స్‌, 6న సీనియర్స్‌కు పద్యపఠన పోటీ, 6న జూనియర్స్‌, 7న సీనియర్స్‌కు వక్తృత్వం, 8న ఉదయం జూనియర్స్‌, మధ్యాహ్నం సీనియర్స్‌కు వ్యాస రచన, 9న క్విజ్, 11న మట్టితో కళాఖండాల తయారీ, 12న కాగితపు బొమ్మల తయారీ, 13న వేషధారణ, జానపద నృత్యాల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


ప్రచార ప్రతులను ఆవిష్కరిస్తున్న అయ్యన్న, ఉపాధ్యాయులు

చిరుజల్లులు పడతాయి

అనకాపల్లి, న్యూస్‌టుడే: రాబోయే ఐదు రోజులు జిల్లాలో చిరుజల్లులు పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు. రోజుకు 4 నుంచి 8 మిల్లీమీటర్ల వర్షం పడవచ్చని చెప్పారు. పగటి అత్యధిక ఉష్ణోగ్రతలు 32.1 నుంచి 33.3 సెల్సియస్, రాత్రి 24.5 నుంచి 25.9 డిగ్రీలు ఉంటాయని వివరించారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యా ప్రమాణాలు మెరుగునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ వెంకటలక్ష్మమ్మ పేర్కొన్నారు. శుక్రవారం రేగుపాలెం ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. నోట్ పుస్తకాలను పరిశీలించారు. తప్పులు లేకుండా చూడాలన్నారు. వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. హెచ్‌ఎం గణేష్ పాల్గొన్నారు.

గబ్బాడలో ఇసుక విక్రయానికి సన్నాహాలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: గబ్బాడ యార్డులో నిల్వ ఉన్న 48 వేల టన్నులకుపైగా ఇసుకను విక్రయించేందుకు యంత్రాంగం దృష్టిసారించింది. రెండు, మూడు రోజుల్లో జిల్లా అధికారులు దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ వి.వి.రమణ, గనుల శాఖ ఏడీలు ఎం.శ్రీనివాసరావు (అనకాపల్లి), శివాజీ (నర్సీపట్నం), తహసీల్దారు రామారావు శుక్రవారం యార్డును సందర్శించారు. కాటా, సీసీ కెమెరాలు పనిచేస్తున్నదీ, లేనిదీ పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సమావేశమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించారు. గతంలో ఇసుక అమ్మకాలను పర్యవేక్షించిన నలుగురు సచివాలయ సిబ్బందిని పెదబొడ్డేపల్లి గనుల శాఖ కార్యాలయానికి పిలిపించి నిర్వహణ ఎలా ఉండేదో తెలుసుకున్నారు. విక్రయాలకు వీలుగా ఈ-పోస్ మిషన్, సెల్‌ఫోన్లు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం గబ్బాడ ఇసుక నిల్వ కేంద్రం వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. పునరుద్ధరించాలని ఉన్నతాధికారులతో మాట్లాడాలని అధికారులు యోచిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రమంతా జులై 8న ఉచితంగా ఇసుక సరఫరా చేసే చేపట్టినా గబ్బాడలో మొదలు కాలేదు. రాజమహేంద్రవరంలో అక్రమంగా తవ్వి ఇక్కడ నిల్వ చేశారని, విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకున్న తర్వాతే అమ్మకాలు చేపట్టాలని శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదేశించడంతో ఇక్కడ అమ్మకాలు మొదలు కాలేదు. పర్యావరణ అనుమతులు లేకుండానే రాజమహేంద్రవరంలో ఇసుక తవ్వి ఇక్కడ నిల్వ చేశారని గనులశాఖ అధికారులు గుర్తించి ప్రతిమ సంస్థ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చారు. పర్యావరణ అనుమతులకు సంబంధించిన పత్రాలన్నీ సమర్పించామని, తమ తప్పిదం ఏదీ లేదని సంస్థ ప్రతినిధులు తెలియజేసినా సంతృప్తి చెందని అధికారులు రూ.18.7 కోట్లు జరిమానా చెల్లించాలని ఇటీవల నోటీసు జారీ చేశారు. దీనిపై గుత్తేదారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇసుక విక్రయాలకు చర్యలు తీసుకోవాలని మూడు రోజుల కిందట సభాపతి అయ్యన్నపాత్రుడు గనుల శాఖ ఏడీ శివాజీకి సూచించారు. అంతకు ముందు కలెక్టర్‌తోనూ మాట్లాడారు.


ఆర్డీవో రమణతో సమావేశమైన గనుల శాఖ అధికారులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జట్లు ఇవే..

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కూండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. 17 ఏళ్ల లోపు బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఒక్కో విభాగంలో 12 మంది ప్రధాన క్రీడాకారులతో పాటు ఇద్దరు అదనపు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలను తెదేపా నాయకుడు నందారపు సూరిబాబు ప్రారంభించారు. హెచ్‌ఎం ఎంకే భాస్కరం, పీఈటీలు కేఎం నాయుడు, కె ధనంజయరావు, నిరుజోగి వెంకటరావు, సన్యాసినాయుడు, ముత్యం శ్రీను, ఎన్ఎస్ రాజా తదితరులు పాల్గొన్నారు.


జిల్లా బాలుర జట్టు

నేడు ఖోఖో, చదరంగం పోటీలు: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి పట్టణంలోని ప్రధాన జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో చదరంగం పోటీలు, తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖోఖో పోటీలు జరుగుతాయని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు తెలిపారు.


జిల్లా బాలికల జట్టు

కాలంచెల్లిన పదార్థాలు విక్రయిస్తే చర్యలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.నీరజ ఆదేశించారు. ఎలమంచిలిలో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, కిరాణా దుకాణాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలంచెల్లిన పదార్థాలతో బేకరీలో ఆహార ఉత్పత్తులను తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆహార పదార్థాల్లో రంగులు వినియోగించరాదన్నారు. ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. హోటళ్లలో తాజా పదార్థాలతోనే ఆహారాన్ని తయారుచేయాలన్నారు. బేకరీలో ప్రమాణాలు పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిరాణా దుకాణాల్లో కాలంచెల్లిన పదార్థాలను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. స్టేషన్ రోడ్డులోని కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు. ఆమె వెంట సిబ్బంది పాల్గొన్నారు.



ఆహార నిల్వలను తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీరజ

డోలీలో బాలింత కష్టాలపై విచారణ

రోలుగుంట, న్యూస్‌టుడే: అర్ల శివారు పిత్రిగెడ్డకు చెందిన బాలింత కిల్లో దేవి, పసికందును కుటుంబ సభ్యులు ఆరు కి.మీ. దూరం డోలీలో ఆసుపత్రికి తీసుకువచ్చిన ఘటనపై నర్సీపట్నం ఆర్డీఓ వి.వి.రమణ శుక్రవారం విచారణ చేపట్టారు. దేవికి నెలలు నిండటంతో ఈ నెల 16వ తేదీ రాత్రి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఉదయాన్నే తల్లీబిడ్డను వైద్యం నిమిత్తం డోలీలో బుచ్చెంపేట ఆసుపత్రికి తీసుకువచ్చారు. దీనిపై శుక్రవారం 'డోలీలో బాలింత ఆమె ఒడిలో పసిగుడ్డు' శీర్షికతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. జిల్లా అధికారుల ఆదేశాలతో ఆర్డీవో వి.వి.రమణ, రోలుగుంట ఇన్‌ఛార్జి తహసీల్దారు శంకర్ కాలినడకన పిత్రిగెడ్డ చేరుకుని విచారణ చేపట్టారు. రహదారి సదుపాయం లేకపోవడం వల్లే డోలీలో తరలించాల్సి వచ్చిందని ఆదివాసీ గిరిజనులు పేర్కొన్నారు. గతంలో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదని వాపోయారు.


పత్రిగెడ్డ గిరిజనులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణ

వహ్వా.. రంగుల మిడత


గులాబీపై బుద్ధిగా కూర్చున్న మిడత ఇది.. రంగులతో అందంగా ఉన్న ఇలాంటివి ప్రస్తుతం నక్కపల్లిలో పలుచోట్ల కనిపిస్తున్నాయి. పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు. –నక్కపల్లి, న్యూస్‌టుడే

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

రావికమతం, న్యూస్‌టుడే: ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్న యువకుడి కుటుంబంలో విషాదం అలుముకుంది. ఒక్కగానొక్క కుమారుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందడంతో తల్లిదండ్రులు, 'కలకాలం తోడుంటానని ఏడడుగులు నడిచి ఒంటరిని చేసి వెళ్లిపోయావా' అంటూ భార్య రోదనలు మిన్నంటాయి. రావికమతం మండలం కిత్తంపేటకు చెందిన కొమ్మనాపల్లి సన్నిబాబు, కాసమ్మ దంపతులకు దుర్గాప్రసాద్ (28) ఒక్కడే సంతానం. నాలుగేళ్ల కిందట ఏటిగైరంపేటకు చెందిన లక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. రైతు కుటుంబానికి చెందిన దుర్గాప్రసాద్ కూలీ పనులు చేస్తూనే ఐటీఐ ఎలక్ట్రీషియన్ పూర్తి చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో కిత్తంపేటతోపాటు దొండపూడి, జెడ్.బెన్నవరం, మత్స్యవానిపాలెం, టి.అర్జాపురం, చిలకవానిపాలెం, ఆర్.కొత్తూరు గ్రామాల్లో ప్రైవేటుగా ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామానికి చెందిన సీతిని రామారావు ఇంట్లో పని ఉంటే శుక్రవారం వెళ్లాడు. వర్షం పడుతుండగా దొండపూడి వద్ద సరఫరాను నిలిపివేసేందుకు యత్నిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న సగరపు సాయికుమార్ గమనించి కిత్తంపేట వాసులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన అక్కడకు చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న దుర్గాప్రసాద్‌ను కొత్తకోట పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. తల్లి కాసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీనివాసరావు చెప్పారు.


దుర్గాప్రసాద్ (పాత చిత్రం)

పింఛన్ల సొమ్ము ఖజానాలో జమ

గొలుగొండ, న్యూస్‌టుడే: సామాజిక పింఛన్లకు సంబంధించిన రూ.1.3 లక్షల నగదును సొంతానికి వాడేసుకున్న పాకలపాడు సచివాలయ సంక్షేమ సహాయకుడు అశోక్‌కుమార్ శుక్రవారం ఆ మొత్తాన్ని ఖజానాకు జమ చేశారు. పింఛను సొమ్ము స్వాహాపై గురువారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో ఆ మొత్తాన్ని ఖజానాలో జమ చేసి తమకు రసీదు అందజేశారని మండల పరిషత్తు కార్యాలయ ఏవో సత్యనారాయణ వివరించారు. ఆయనపై ఏం చర్యలు తీసుకోవాలో జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని ఏవో చెప్పారు.

తండ్రి రుణం తీర్చుకునే యత్నం..

రాంబిల్లి, న్యూస్‌టుడే: తండ్రికి తలకొరివి పెట్టి కుమార్తె రుణం తీర్చుకుంది. ఈ ఘటన అప్పన్నపాలెంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ గ్రామానికి చెందిన బొగడకుర్తి రాములు (75) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఇతనికి భార్య మహలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు జి.సిల్కు, ఎల్.చిన్నమ్మలు ఉన్నారు. కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తె సిల్కు తండ్రి అంత్యక్రియలు నిర్వహించింది.


తండ్రి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె

రైవాడ... చూస్తే గుండెదడ!

దేవరాపల్లి, న్యూస్‌టుడే

ప్రశాంత వాతావరణంలో.. ప్రకృతి ఒడిలో చూడచక్కనైన ప్రాంతం రైవాడ జలాశయం. అందాలను ఆస్వాదించేందుకు వచ్చినవారంతా ఇక్కడ నిర్వహణ కొరవడిన పరిస్థితి చూసి భయాందోళనకు గురవుతున్నారు.



రైవాడ వెళ్లడానికి గతంలో పర్యాటకులు ఉవ్విళ్లూరేవారు. కానీ ఇప్పుడు జలాశయం గట్టుతోపాటు జలాశయం లోపల, బయట పెద్ద, పెద్దచెట్లు, తుప్పలు, డొంకలు పెరిగిపోవడంతో అదొక అరణ్యంలా కనిపిస్తోంది. అక్కడకు వెళ్లాలంటే ఏ పొదలో ఏ విషసర్పం ఉందో అని భయపడేంతగా ఈ ప్రాంతం తయారైంది. సుమారు 6 కిలోమీటర్ల పొడవైన మట్టిగట్టుపై గతంలో వాహనాల్లో హాయిగా ప్రయాణించేవారు. ప్రస్తుతం అడుగడుగునా పెద్దపెద్ద గుంతలు పడటంతో నడవడానికి సైతం వీలులేని స్థితి. జలాశయ లోపలి భాగంలోని గట్టు అంతా చెట్లు ఎదిగి వనాన్ని తలపిస్తోంది. వీటి వేళ్లు మట్టి గట్టులోకి చొచ్చుకుపోవడంతో గట్టు రోజురోజుకు బలహీన పడుతోంది. దీనిని ఇలాగే వదిలేస్తే వరదల సమయంలో ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనన్న భయం అందరినీ వెంటాడుతోంది. జిల్లాలో ఓ వైపు 15,344 ఎకరాలకు సాగునీరు అందిస్తూ మరోవైపు విశాఖ మహానగర ప్రజల దాహార్తి తీర్చే కల్పతరువులాంటి రైవాడ జలాశయానికి ఏ ముప్పు కలగకుండా తక్షణం రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.


గట్టుకు ఇరుపక్కల గుబురుగా తుప్పలు

గట్టు లోపల భాగంలో చెట్లు

ప్రతిపాదనలకు ఆమోదం

రైవాడ జలాశయ నిర్వహణకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం. రైవాడ నుంచి కె.కోటపాడు దేవరాపల్లి మండలాల్లోని చెరువులకు నీరందించే కాలువల మరమ్మతుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జలాశయ నిర్వహణతోపాటు కాలువల పనులకు రూ.3.06 కోట్లు విడుదల చేయనుంది. నిధులు విడుదల కాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

– సత్యంనాయుడు, రైవాడ జలాశయ డీఈఈ

నేడు, రేపు డైవర్స్/విడో/విడోవర్ (అన్ని కులాలు)లకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి డైవర్స్/విడో/విడోవర్‌లకు ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విశాఖపట్నం అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలో ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (శనివారం, అక్టోబరు 19న), రేపు (ఆదివారం, అక్టోబరు 20న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 91549 18858, 80080 01686 ఫోన్‌నెంబర్ల ద్వారాగానీ, యాప్‌ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నెంబర్లకు పంపించవచ్చు. – న్యూస్‌టుడే, విశాఖపట్నం

వెలుగు సమాఖ్య ఎన్నికల్లో రసాభాస

సబ్బవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా వెలుగు సమాఖ్య ఎన్నికల్లో రసాభాస చోటుచేసుకుంది. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ ఎన్నికలను శుక్రవారం సబ్బవరంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న 24 మండల సమాఖ్యల నుంచి ముగ్గురు చొప్పున 72 మంది హాజరయ్యారు. కేవలం అధ్యక్షులు మాత్రమే పోటీలో పాల్గొనాలని అధికారులు సూచించడంతో పోటీ చేసేందుకు 24 మంది మాత్రమే అర్హులుగా మిగిలారు. బలహీన వర్గాలకు చెందిన వారి నుంచి అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉండగా ఎస్టీకి చెందినవారు లేకపోవంతో తరువాత ఎస్సీలకు ప్రాధాన్యం ఇచ్చారు. అక్కడి నుంచే గందరగోళం మొదలైంది. ఎస్సీ వర్గానికి చెందిన ఒక మహిళను అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. తరువాత కార్యదర్శి ఎన్నికకు నలుగురు పోటీ పడగా వారిలో నర్సీపట్నానికి చెందిన సాయి ప్రశాంతిని 13 ఓట్లతో సభ్యులు ఎన్నుకున్నారు. సాయి ప్రశాంతి ఎన్నికల్లో పాల్గొనడం ఇష్టపడని కొందరు ఆమె మరో సొసైటీలో సభ్యత్వం కలిగి ఉన్నందున ఆమె పోటీకి అనర్హురాలని వారించడంతో సాయి ప్రశాంతిని బలపరిచిన వారంతా ఎన్నికను బహిష్కరించి బయటకు వచ్చేశారు. దీంతో ఎన్నిక వాయిదా పడినట్లు అనకాపల్లి జిల్లా వెలుగు ఏపీడీ డి.డైసీ పేర్కొన్నారు. 'ఎన్నికలో పోటీచేసే అర్హత సాయి ప్రశాంతికి లేదు. ఆమె మరో ఎన్‌జీవో సంస్థలో సభ్యత్వం కలిగి ఉన్నారు. వాస్తవానికి ఆమె నర్సీపట్నం మండల సమాఖ్యకు అధ్యక్షురాలిని కూడా చేయకూడదు. అలా చేయడం వల్లనే ఆమె జిల్లా సమాఖ్యకు పోటీ చేస్తానని అంటోంది. మండల సమాఖ్య ఎందుకు ఆమెను అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారో వివరణ కోరుతూ సమాఖ్య సభ్యులకు నోటీసులు జారీ చేస్తాం' అని ఏపీడీ డి.డైసీ పేర్కొన్నారు. 'చదువు లేని వారిని, గిరిజనులను, ఎస్సీలను జిల్లా సమాఖ్యకు ఎన్నుకుని సంస్థను దోచుకుంటున్నారు. నాలాంటి చదువుకున్న మహిళ సమాఖ్యకు వస్తే ఎక్కడ వారి దోపిడీలకు అడ్డుకట్ట పడుతుందోనన్న భయంతో తనను ఎన్నిక కాకుండా తప్పించారు' అని సాయి ప్రశాంతి ఆరోపించారు.


ఎన్నికలను బహిష్కరించి వెళ్లిపోతున్న మండల సమాఖ్యల అధ్యక్షులు

నిపుణుల సూచనలతో పకడ్బందీగా ప్రణాళిక

'విశాఖ గ్రోత్ హబ్ ప్రాజెక్టు'పై నీతిఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ, సమీప జిల్లాలకు రూపొందిస్తున్న అభివృద్ధి ప్రణాళికలపై నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం సమీక్షించారు. ఆయా జిల్లాల్లో ఏ రంగాలను కొత్తగా గుర్తించి వృద్ధిలో భాగస్వామ్యం చేయొచ్చో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రూపొందించిన ప్రణాళికల స్థితిగతులపై చర్చించారు. విశాఖ మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ) సమావేశ మందిరంలో శుక్రవారం నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో 'విశాఖ గ్రోత్ హబ్ ప్రాజెక్టు' రూపకల్పనపై పలు జిల్లాల కలెక్టర్లు, కమిటీ సభ్యులు ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. విశాఖ, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఉన్న అవకాశాలు, సహజవనరుల లభ్యత, సేవా రంగాల పరిస్థితి, వ్యవసాయ, ఆహార సంబంధ పరిశ్రమల స్థితి వాటి అనుకూల, ప్రతికూల అంశాలపై చర్చించారు. ఆయా జిల్లాల్లో ఏ రంగాలను ప్రోత్సహిస్తే ఏవిధమైన అభివృద్ధి జరుగుతుందో అధికారులు తెలియజేశారు. ఆయా అంశాలపై సంబంధిత రంగాల నిపుణులతో చర్చించి నవంబరు నాటికల్లా ఒక విధానం రూపొందించాలని సీఈవో సూచించారు. వారణాశి, ముంబయి, సూరత్ ప్రాంతీయ ప్రణాళికలు రూపకల్పన చివరి దశలో ఉన్నాయని, విశాఖది మాత్రం మధ్య దశలోనే ఉందన్నారు. జనవరి నాటికల్లా దీనికి తుది రూపు తీసుకురావాల్సి ఉందని స్పష్టం చేశారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు హరేంధిరప్రసాద్, విజయకృష్ణన్, దినేశ్‌కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

తెదేపా కార్యాలయంలో ప్రజాదర్బార్

వినతులు స్వీకరించిన మంత్రి లోకేశ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రెండు రోజుల విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం తెదేపా కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినతులు స్వీకరించడంతో పాటు మంత్రి వారితో ఆత్మీయంగా మాట్లాడారు. ● 2019లో నియామకమైన ఆర్టీసీ డ్రైవర్ల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఒప్పంద ఆర్టీసీ డ్రైవర్లు కోరారు. వైకాపా ప్రభుత్వంలో మాకు పీఆర్సీ అమలు చేయక, జీవనం నష్టపోయామని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ● గత వైకాపా పాలనలో చంద్రబాబు అక్రమ అరెస్టు విని తన భర్త గుండెపోటుతో మరణించారని, దీంతో తమ కుటుంబానికి ఎలాంటి ఆధారం లేకుండా పోయిందని అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం కండపాలేనికి చెందిన దాలాలక్ష్మి మంత్రి ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. తనకు పెద్దగా కేజీబీవీ నందు ఏదైనా ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. ● అధికారులు చేసిన తప్పులకు న్యాయం కోసం పడిగాపులు కాస్తున్నానని, విశాఖ గ్రామీణ ప్రాంతానికి చెందిన చిన్నారావు మంత్రి లోకేశ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్మాణ రంగం సమస్యలను పరిష్కరించాలి: నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను పరిష్కరించాలని క్రెడాయ్ ప్రతినిధుల బృందం మంత్రి లోకేశ్‌ను కోరింది. తెదేపా కార్యాలయంలో క్రెడాయ్ ఛైర్మన్ కేఎస్‌ఆర్‌కే రాజు, అధ్యక్షుడు వి.ధర్మేందర్, కార్యదర్శి వి.శ్రీను, ఉపాధ్యక్షుడు సీహెచ్.గోవిందరాజు మంత్రి లోకేష్‌ను కలిశారు. ఆయా సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారని క్రెడాయ్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.


బాధితురాలి గోడు వింటున్న మంత్రి లోకేశ్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ డిమాండ్ చేశారు. అనకాపల్లి సీఐటీయూ కార్యాలయం వద్ద శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు లేవన్నారు. పీఎఫ్ డబ్బులను సకాలంలో సంబంధిత విభాగాల్లో జమ చేయడం లేదన్నారు. జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్యదర్శులు జీఎస్ ప్రకాష్, శేష కుమార్, సంఘ నేతలు ఎల్లయ్యబాబు, ఎంవీ అప్పారావు, అక్కునాయుడు, సతీష్ పాల్గొన్నారు.


ధర్నాలో ఉపాధ్యాయులు

గుండెపోటుతో సైనికోద్యోగి మృతి

కశింకోట, న్యూస్‌టుడే: పరవాడపాలెం గ్రామానికి చెందిన సైనికోద్యోగి పరవాడ నాయుడుబాబు (37) గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. జమ్ము కశ్మీర్‌లో జవానుగా పనిచేస్తున్నారు. స్వగ్రామం రావడానికి బయలుదేరిన ఆయనకు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. మృతదేహాన్ని శుక్రవారం రాత్రి స్వగ్రామానికి తీసుకువచ్చారు. 2010లో సైన్యంలో చేరిన నాయుడుబాబు వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ఏడాదిన్నర క్రితం వివాహమైన ఆయనకు భార్య శాంతి స్వరూప ఉన్నారు. ఆయన మరణవార్తను విని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం సైనిక లాంఛనలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సోదరుడు భవానీ యోగేశ్వరరావు తెలిపారు.


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్థులు (అంతర్‌చిత్రం) నాయుడుబాబు

బస్సు ఢీ: ఒకరి దుర్మరణం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వెదురువాడ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆళ్ల రవికుమార్ (35) మృతి చెందారు. సీఐ నమ్మి గణేష్ కథనం ప్రకారం.. అనకాపల్లి విజయరామరాజుపేటకు చెందిన రవికుమార్ రోజూ మాదిరిగానే గురువారం రాంబిల్లి ఎన్‌ఏఓబీలో విధులు ముగించుకొని రాత్రి 10 గంటల సమయంలో అచ్యుతాపురంలో టీ తాగడానికి రోడ్డు దాటుతుండగా ఎలమంచిలి వైపు వెళ్తున్న ప్రైవేటు కంపెనీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు అనకాపల్లికి, అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌సీలో చికిత్సలో పొందుతూ గురువారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందారు. తండ్రి ఆళ్ల జగ్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్డ్	206	240
స్కిన్‌లెస్	234	250

PUBLIC NOTICE

Under the instructions of my client **M/s. SHRIRAM FINANCE LIMITED, NAD Branch, Visakhapatnam,** I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. VABBILISETTI SATYA RAO** S/o P Demullu by keeping below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Erstwhile Visakhapatnam District, presently Anakapalli District, Chodavaram Sub-District, Chodavaram Mandalam, Chodavaram Gram panchayat and village accounts, Venkayyagaripeta, Ward No.2, Block No.2, zeriothy dry land covered S. Nos. 4-2-C, 4-2-D, an extent of Ac.0.44 cents, Eastern side of R & B Road leading from Chodavaram to Cheedikada near B. Ed college, Plot No.15 an extent of 155.83 sq. yards or 130.897 Sq. meters of vacant site is measured and bounded by: **East:** Plot No.14 site - 46.75 feet or 14.212 meters; **South:** 20 feet wide road - 30.00 feet or 9.120 meters; **West:** Plot No.16 site - 46.75 feet or 14.212 meters; **North:** Dry land of Saketha Uma - 30.00 feet or 9.120 meters.

KODURI SREENIVASA RAO
SMT. SHIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu Bazar, Seethammadhara, Visakhapatnam-13.
Mobile No. 9885166648
Mail: sreenivaskoduri@gmail.com
Visakhapatnam Dt.18.10.2024

పది, ఇంటర్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్‌లో ప్రవేశాలు పొందడానికి అపరాధ రుసుంతో ఈనెల 31 గడువు పొడిగించినట్లు డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 25 వరకు, రూ. 200 అపరాధ రుసుంతో ఈనెలాఖరు వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

ఇసుక ర్యాంపుల గుర్తింపు

పాయకరావుపేట గ్రామీణం, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఇసుక లభ్యమయ్యే ప్రదేశాలను రెవెన్యూ అధికారులు గుర్తిస్తున్నారు. మాసాహెబ్‌పేట, కేశవరం, సత్యవరం, దార్లపూడి, పెదఉప్పలం గ్రామాల్లో నదీ పరీవాహక ప్రాంతాల్లో తహసీల్దార్లు సత్యనారాయణ, రమేష్‌బాబు ఎంపీడీవోలు జయప్రకాశరావు, సత్యనారాయణ, పర్యటించారు. ఇసుక ర్యాంపులు, రవాణాకు అనువైన మార్గాలపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తెలిపారు.


మాసాహెబ్‌పేట వద్ద తాండవనదిలో ర్యాంపు పరిశీలిస్తున్న అధికారులు

రోగుల కష్టాలకు చెల్లు

అనకాపల్లిలో సీటీ స్కాన్ | నక్కపల్లిలో ఎక్స్‌రే సదుపాయం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరుపయోగంగా ఉన్న పరికరాలు వినియోగంలోకి రానున్నాయి. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో శనివారం నుంచి సీటీస్కాన్ అందుబాటులోకి తెస్తున్నారు. నక్కపల్లిలో ఎక్స్‌రే సదుపాయాన్ని నెలాఖరులోగా రోగుల ముంగిటకు తేనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు ముమ్మరయ్యాయి.

అనకాపల్లి పట్టణం, నక్కపల్లి, న్యూస్‌టుడే

అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో సీటీ స్కాన్ సేవలు రోగులకు అందించేలా కూటమి సర్కారు చర్యలు తీసుకుంది. ఈ పరికరం శనివారం నుంచి అందుబాటులోకి రానుంది. వైకాపా హయాంలో ఐదేళ్ల పాటు అనకాపల్లి ఆసుపత్రిలో సీటీ స్కాన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. 2007లో కాంగ్రెస్ హయాంలో మంత్రిగా ఉన్న కొణతాల రామకృష్ణ ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి సీటీ స్కాన్ పరికరాన్ని సమకూర్చారు. దీంతో రోగులకు సేవలు అందేవి. 2019లో వైకాపా హయాంలో పరికరం మరమ్మతులకు గురైనా బాగు చేయించలేదు. అదానీ గ్రూపు సహకారంతో ఆసుపత్రికి పరికరం సమకూరినా వినియోగించేందుకు సిబ్బంది నియమించని కారణంగా పరికరం ఉన్నా ఉపయోగం లేకపోయింది.

సిబ్బంది నియామకం: సీటీ స్కాన్ సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టారు. ఇద్దరు టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అవసరమైన రోగులకు సీటీ స్కాన్ తీసేలా చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఈ పరికరాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. జిల్లాలోని రోగులకు అవసరం మేరకు సీటీ స్కాన్ తీసి సేవలు అందించాలని సూచించారు.

నక్కపల్లిలో 50 పడకల ఆసుపత్రిలో నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన వేలాది మంది ప్రతినెలా చికిత్స నిమిత్తం వస్తుంటారు. దీంతోపాటు జాతీయ రహదారిపై ప్రమాదాలకు గురైన వారిని ఇక్కడికే తీసుకువస్తుంటారు ప్రతినెలా వందల సంఖ్యలో ఎక్స్‌రేలు అవసరం పడుతుంటాయి.


అనకాపల్లిలో సీటీ స్కాన్ పరికరం

నెలాఖరులోగా

మంత్రి అనిత సూచనల మేరకు నాయకులు, అధికారులు కలిసి మాట్లాడగా, దీని బిగింపునకు హెటెరో ప్రతినిధులు ముందుకు వచ్చారు. ప్రస్తుతం నిర్మాణ పనులు తుదిదశకు చేరాయి. ఇప్పుడు జరుగుతున్న పనులతో ఎక్స్‌రే సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లో వెళ్లాలని రోగులకు సూచిస్తున్నాం. వీలైనంత త్వరగా పూర్తిచేసి, నెలాఖరులోగా సేవలు ప్రారంభించేలా చూస్తాం.
- డాక్టర్ శిరీష, ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి

ప్రస్తుతం వాడుతున్న యంత్రం చాలా పాతకాలానిది. దీని స్థానంలో నూతన యంత్రాన్ని కొద్ది నెలల కిందటే కేటాయించారు. అయితే దీని ఏర్పాటుకు అవసరమైన నిధులు అవసరం కావడంతో పని పూర్తికాలేదు. పలితంగా మిషన్‌కు సంబంధించిన పరికరాలన్నీ తెరవకుండానే పెట్టెల్లో ఉంచేశారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో రెండు నెలల క్రితం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించి, సమస్య తెలుసుకున్న మంత్రి అనిత నూతన యంత్రం ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే దాతల సాయం తీసుకోవాలన్నారు. అధికారులు, నాయకులు దాతలను కలిసి మాట్లాడగా, ప్రయత్నం సఫలమైంది. ప్రస్తుతం ఎక్స్‌రే గదిలో పాత యంత్రం తొలగించి, ఇందులో ప్రత్యేక ఛాంబర్ నిర్మిస్తున్నారు. దీనికి దాదాపు రూ. మూడు లక్షలకుపైగా ఖర్చవుతుందని సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న పనులతో మూడు వారాలుగా ఎక్స్‌రే సేవలు ఆగిపోయాయి. దీంతో అవసరమైనవారు బయటకు వెళ్లి ఎక్స్‌రే తీయించుకుంటున్నారు. ఇది అందుబాటులోకి వస్తే నాణ్యమైన, వేగవంతమైన సేవలు సంబంధిత రోగులకు అందనున్నాయి.


నక్కపల్లిలో ఎక్స్‌రే గది నిర్మాణం

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థుల సత్తా


వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఇంటర్‌నెట్ వినియోగం బాగా పెరిగింది. అరచేతిలో సెల్ ఉంటే ప్రపంచం మన చేతిలో ఉన్నట్లేనని అంతా అనుకుంటున్నారు. 'ఇంటర్‌నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై 'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు శుక్రవారం జరిగాయి. అనకాపల్లిలోని సిటీ పబ్లిక్ పాఠశాలలో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆరు నుంచి పది తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో 10వ తరగతి విద్యార్థి టి.ధనుష్, ద్వితీయ స్థానంలో పదోతరగతి విద్యార్థి సి.హెచ్. దివ్యశ్రీ, తృతీయ స్థానంలో ఎనిమిదో తరగతి ఎం.వస్మిత నిలిచారు. విజేతలకు సిటీ పబ్లిక్ పాఠశాల కరస్పాండెంట్ కేవీఎస్ ప్రకాశరావు, ప్రిన్సిపల్ కె.ఉమాదేవి బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు వి.సత్యమహాలక్ష్మి, ఎస్.భవాని, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.


ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించిన ప్రకాశరావు

అవీ ఇవీ

ముగిసిన శిక్షణ తరగతులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యుల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయప్రకాష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనిత పర్యటన నేడు

నక్కపల్లి, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: మంత్రి వంగలపూడి అనిత శనివారంఉదయం పెదబోదిగల్లం దర్గాలో ప్రార్థనలు చేస్తారు. సాయంత్రం చినదొడ్డిగల్లులో నిర్వహించే పల్లె పండగలో పాల్గొంటారని తెదేపా నేత వెంకటేశ్ తెలిపారు. ఎస్.రాయవరం మండలం పెట్టుగొళ్లపల్లిలో ఉదయం 11 గంటలకు నిర్వహించే పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొంటారని ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు.

నట్టల నివారణకు ఉచితంగా మందులు

అనకాపల్లి: గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు ఉచితంగా మందులు వేస్తున్నామని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ రామ్మోహనరావు తెలిపారు. అనకాపల్లి మండలంలో 440 గొర్రెలు, 320 మేకలు, కశింకోట మండలంలో 750 గొర్రెలు, 410 మేకలకు మందులు వేశామని అసిస్టెంట్ డైరెక్టర్ సౌజన్య తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం: మడుతూరు, ఎరిచెర్లపాలెం, రాజానగరం, తంతడి, వాడపాలెం, అంగనపాలెం, దోసిపాలెం, యాతపాలెం గ్రామాలకు శనివారం విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్, ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. లైనులపై చెట్ల కొమ్మలను తొలగించడానికి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

గొలుసు దుకాణానికి వేలం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల కేటాయింపునకు ప్రభుత్వం అధికారికంగా వేలంపాటలు నిర్వహించగా కొన్ని గ్రామాల్లో గొలుసు దుకాణాల ఏర్పాటుకు పోటీ పెడుతున్నారు. దుకాణాలు దక్కించుకున్న వారు పార్టీలకు అతీతంగా ఏకమై వీటిని నిర్వహించుకోవడానికి సిద్ధమయ్యారు. మార్టూరులో గొలుసు దుకాణం నిర్వహణకు ఏడాదికి రూ. 5.25 లక్షలు వేలంపాట జరిగినట్లు తెలిసింది.

డీఎల్‌పురంలో ఇంటిపై పిడుగు

నక్కపల్లి, న్యూస్‌టుడే: డీఎల్‌పురంలో ఓ ఇంటిపై పిడుగు పడగా, భారీ నష్టం వాటిల్లింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో గురువారం వర్షం కురిసినప్పుడు ఆ.నాగరాజు ఇంటిపై పిడుగు పడింది. దీని ప్రభావానికి ఇంట్లో శ్లాబు దెబ్బతినడంతో పాటు, ఫ్రిజ్, టీవీ, మోటారు, ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. దాదాపు రూ. లక్ష మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు.

బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై నక్కపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మనబాలవానిపాలెంకు చెందిన కొర్రా శ్రీను నక్కపల్లిలో రోడ్డు దాటుతుండగా, అల్లూరి జిల్లా అరకులోయకు చెందిన కెల్లి వినోద్ తన స్నేహితుడితో కలిసి బైక్‌పై అటు వైపు వెళుతూ శ్రీను వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శ్రీను తలకు బలమైన గాయమైంది. వినోద్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: అనకాపల్లి లక్ష్మీదేవిపేటలో వీధిలైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలి. - రజని, అనకాపల్లి
✓: కొత్త లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - నానాజీ, ఏఈ

సిబ్బంది కొరత తీరుస్తాం: కొణతాల

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఆసుపత్రిని ఆధునీకరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. అనకాపల్లిలోని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిని శుక్రవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ల్యాబ్, వార్డులు, అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వార్డుల్లోని రోగుల వద్దకు వెళ్లి అందుతున్న వైద్యసేవలను అడిగితెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రి అయినా దీనికి తగ్గట్టు వసతులు లేవన్నారు. వైద్య సిబ్బంది కొరత, మందులు, సర్జికల్ ఐటెమ్ కొరత వంటి సమస్య ఉన్నాయని వీటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జిల్లా ఆసుపత్రికి తగ్గట్టుగా వసతులు కల్పించి అన్ని రకాల వైద్యసేవలు ఇక్కడే అందించేలా చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. చాలా చోట్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నాయన్నారు. ఆసుపత్రిని ఆధునీకరించేందుకు రూ. 5 కోట్లతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గైనిక్ వార్డులో అత్యధిక ప్రసవాలు జరుగుతున్నా వైద్య సిబ్బంది కొరత ఉందని, దీన్ని భర్తీ చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ. 22 కోట్లతో ఆసుపత్రి వద్ద క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. నాలుగు అంతస్తుల్లో నిర్మిస్తున్న భవనంలో ట్రామాకేర్ సెంటర్, డయాలసిస్, మాతా, శిశు సంరక్షణ వైద్యం వంటి అత్యవసర వైద్యాన్ని అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యులు గౌతమ్, లక్ష్మణ్ శ్రీనివాస్, విష్ణుప్రియ, జనసేన నాయకులు ఆళ్ల రామచంద్రరావు, గొల్లబాబు, దదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


హరిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

అచ్యుతాపురం, మునగపాక, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు అని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. పల్లెపండగ కార్యక్రమంలో జగన్నపేట, ఖాజీపాలెం, పెదపాడు, తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్ల, యర్రవరం, ఉప్పవరం, ఎం.జగన్నాథపురం గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. సీసీ రోడ్ల పనులు ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. గత ఐదేళ్లు అభివృద్ధి కనిపించలేదన్నారు. అభివృద్ధిని మరిచి జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు, వేధింపులపైనా ఐదేళ్లు ఆలోచన చేసిందన్నారు. నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి రాంబాబు, పీలా తులసీరామ్, జనపరెడ్డి నర్సింగరావు, ద్వారపురెడ్డి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట గ్రామీణం, కోటవురట్ల, న్యూస్‌టుడే: పాల్తేరు, శ్రీరాంపురం గ్రామాల్లో రోడ్లు, కాలువ పనులను సర్పంచులు గోసల కృష్ణ, గారా కృష్ణప్రసాద్ ప్రారంభించారు. నాయకులు దేవవరపు రాజబాబు, చించలపు వెంకట్రావు, ఎంపీడీవో జయప్రకాశరావు పాల్గొన్నారు. కోటవురట్ల మండలం రాజుపేట శివారు రామన్నపాలెం, బోడపాలెం, పాములవాక, పి.కొత్తపల్లిల్లో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ, ఎంపీడీఓ కాశీ విశ్వనాథరావు, పీఆర్ ఏఈ మండల కమిటీ అధ్యక్షులు జానకి శ్రీను, సర్పంచి వెంకటరమణ, సత్యనారాయణ, నానిబాబు పాల్గొన్నారు.

నక్కపల్లి, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: నక్కపల్లి, ఉపమాక, రాజయ్యపేట, పెదతీనార్ల, జానకయ్యపేట గ్రామాల్లో పనులకు కొప్పిశెట్టి వెంకటేష్, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి కొండబాబు, గింజాల లక్ష్మణరావు, కొప్పిశెట్టి బుజ్జి తదితరులు శంకుస్థాపన చేశారు. ఎస్.రాయవరం మండలం సైతారుపేట, సర్వసిద్ధి, వెంకటాపురం, లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, వాకపాడు గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి తెదేపా మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం శంకుస్థాపన చేశారు. అల్లు నరసింహమూర్తి, వెంకటరాజు, ఏపీఓ ఎరకయ్య పాల్గొన్నారు.


పాల్తేరులో రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు, అధికారులు

గ్రామసభల్లో వినతుల వెల్లువ

పాయకరావుపేట గ్రామీణం, నక్కపల్లి, కోటవురట్ల, న్యూస్‌టుడే: సమస్యల అర్జీల ఆధారంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆర్.నరసింహమూర్తి వెల్లడించారు. పరిశ్రమలకు భూములిచ్చిన రైతుల సమస్యలు తెలుసుకోడానికి చందనాడలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ భూములు సాగు చేస్తున్న వారికి కొంతకే పరిహారం ఇచ్చారని, మిగిలినవారికి కూడా చెల్లించాలని కోరారు. సమావేశంలో తల్లబాబ్జీ, గంటా శివాజీరావు, పుణ్యమంతుల బాబ్జీ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. సీహెచ్‌బీ అగ్రహారంలో 16 మంది రైతులు వివిధ సమస్యలపై వినతులు అందించారు. కండిపూడిలో సుమారు 26 మంది రైతులు తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రాలు ఇచ్చారు.

● తమకు ఇచ్చిన డీ పట్టాలకు సంబంధించిన భూములను చూపించాలని కోటవురట్ల మండలం రాజుపేట సర్పంచి బొడ్డేటి వెంకటరమణ, పలువురు పట్టాదారులు తహసీల్దార్ తిరుమలబాబుకు కోరారు. 20 ఏళ్ల క్రితం 11 మందికి డీ పట్టాలు ఇచ్చినా భూములు చూపించలేదన్నారు. నాయకులు వెంకటరమణ, లోవ పాల్గొన్నారు.

రాంబిల్లి, మునగపాక, న్యూస్‌టుడే: కట్టుబోలు గ్రామసభలో రైతుల నుంచి 30 అర్జీలు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు స్వీకరించారు. గ్రామసభలో వచ్చిన అర్జీలపై పూర్తిస్థాయిలో పరిశీలన చేసి లోపాలను సరిచేస్తామని ఆయన అన్నారు. కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కుంచంగిలో చిన్న గదిలో గ్రామసభ నిర్వహించారు. బహిరంగంగా గాని, సమావేశ మందిరాల్లో గాని నిర్వహించాల్సిన గ్రామసభను చిన్న గదిలో నిర్వహించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది ముక్కుసూటిగా నిర్వహించామని మండిపడ్డారు. దివ్యాంగులను కూడా నిలబెట్టి అర్జీలు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన రంగారి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా గ్రామసభను నిర్వహించారన్నారు.

పాఠశాలలో నిర్వహించిన సదస్సులో పలు సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, సర్పంచి బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు బొడ్డేడ హైమవతి పాల్గొన్నారు.


కండిపూడిలో రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

అంబేడ్కర్ పార్కుకు కొత్తరూపు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: అంబేడ్కర్ పార్కు (నందన వనం) ఎట్టకేలకు కొత్తరూపు సంతరించుకోనుంది. ఈ నేపథ్యంలో పార్కులో ఆటలకు వీలుగా కోర్టులు నిర్మించేందుకు జిల్లా అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే నందనవనంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. ఆవరణను పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. ఇక్కడ ప్రామాణికంగా ఇండోర్ స్టేడియం నిర్మించే అవకాశముంది. దీనిలో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేయనున్నారు. వాలీబాల్ ఆడేందుకు వీలుగా మరో కోర్టు నిర్మిస్తారు. దీనిపై పంచాయతీ ఈవో వర్మ మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనల మేరకు పార్కు ఆవరణను సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

మునగపాక, న్యూస్‌టుడే: మూలపేట గ్రామస్థులు శుక్రవారం శ్రమదానం జోడించి రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో రహదారి బాగుపడింది. మూలపేట నుంచి అనకాపల్లి వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకొనే అవకాశంలేదు. దీంతో గ్రామస్థులందరూ చేయి చేయి కలిపి పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించినట్లు మాజీ సర్పంచి బొడ్డేడ చెల్లయ్యనాయుడు తెలిపారు. ఈ పనుల్లో గ్రామస్థులు బొడ్డేడ నాగరాజు, ఆళ్ల కిషోర్, ఆళ్ల సంజీవరావు, బొడ్డేడ అప్పారావు, వెంకట అప్పారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


పిచ్చిమొక్కలు తొలగించిన గ్రామస్థులు

కార్మికుల ఆందోళన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పరిశ్రమను తెరిపించి ఉపాధి కల్పించాలని అబిజిత్ ఫెర్రో పరిశ్రమ కార్మికులు, సీఐటీయూ నాయకులు కంపెనీ ప్రధాన ద్వారం ముందు శుక్రవారం మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ లాభాలు వచ్చినప్పుడు కంపెనీని నడిపి ఇప్పుడు నష్టాల సాకుతో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా మూసివేశారన్నారు. దీనివల్ల నిర్వాసితులతో సహా మూడువేల మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ప్రభుత్వం జోక్యంచేసుకుని కంపెనీని తెరిపించాలన్నారు. నాయకులు రాంగి రాము, సోమునాయుడు, కార్మికులు పాల్గొన్నారు.


కంపెనీ ప్రధాన ద్వారం వద్ద కార్మికుల నిరసన

ఎన్నికల్లో యువత భాగస్వాములు కావాలి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: అర్హులైన యువతీ యువకులంతా ఓటుహక్కు పొందాలని తహసీల్దార్ రమేష్‌బాబు సూచించారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటుహక్కు పొందడం, వినియోగించుకోవడం ఓటర్ల బాధ్యతని తెలిపారు. ప్రలోభాలకు గురికాకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని తెలిపారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవండి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పోలీసులు రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. 65 మంది పోలీసులు, హోంగార్డులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం ఆపద సమయంలో ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.


రక్తదానం శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

ప్రజలపై భారం పెంచితే సహించం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ప్రజలపై విద్యుత్తు ఛార్జీల భారం మోపడానికే కూటమి ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా నాయకులు కర్రి అప్పారావు, రాముసూర్యారావు మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్తుకు ఇప్పుడు సర్దుబాటు ఛార్జీల వసూలు చేయడాన్ని ప్రశ్నించారు. ఈ నిరసనలో నాయకులు శరగడం కన్నబాబు, సోమునాయుడు, బుద్ధ రంగారావు, రొంగలి లక్ష్మి, రావి దేముళ్లు, రమణ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు

వైభవంగా గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠ


మునగపాకలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), మునగపాక, న్యూస్‌టుడే: పట్టణంలో గురపాలెం శ్రీగౌరీ పరమేశ్వరుల ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ మార్కెట్ యార్డు వాకర్స్ క్లబ్ సభ్యులు ఈ సేవలో పాల్గొన్నారు. గౌరీ సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కాంట్రాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు. నాగులాపల్లిలో గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గురువారం గ్రామ గౌరమ్మ విగ్రహాన్ని ప్రత్యేక రథంపై గ్రామ వీధుల్లో ఊరేగించి ఆలయంలో ప్రతిష్ఠించారు. యర్రా భాస్కరరావు, పొలమరశెట్టి నూకాలయ్య, నాగు, బొడ్డేడ గోవింద, రమణాజీ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: గోకులపాడు గ్రామదేవత నూకాంబికకు ఆదే గ్రామానికి చెందిన విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడు శానాపతి రమణ అందజేశారు. గ్రామ బంగారాన్ని విరాళం చేశారు. ఆలయం వద్ద కమిటీ సభ్యులకు శుక్రవారం బంగారాన్ని రమణ అందజేశారు. సమ్మెట లక్ష్మీనారాయణ, సమ్మెంగి నూకరాజు, బాదనపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


కమిటీ సభ్యులకు బంగారాన్ని అందిస్తున్న రమణ

మహిళల ఆర్థికాభివృద్ధితో సమాజ పురోగతి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: మహిళల ఆర్థికాభివృద్ధితోనే సమాజం పురోగతి సాధిస్తుందని రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎంఏ శ్రీరాఘవ పేర్కొన్నారు. పట్టణంలో న్యూకాలనీ రోటరీ హాల్‌లో శుక్రవారం మహిళలకు ఆధునిక కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనకాపల్లి రోటరీ అధ్యక్షులు సంపత్ బొడ్డేడ రమేష్, కార్యదర్శి అనిల్, కుట్టు మిషన్ల ప్రాజెక్టు ఛైర్మన్ కడిమిశెట్టి సతీష్, బుద్ధ రమణాజీ, దత్త సుబ్బారావు పాల్గొన్నారు.


కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో క్లబ్ ప్రతినిధులు

బాలికలను వేధిస్తే కఠిన చర్యలు

కోటవురట్ల, న్యూస్‌టుడే: బాలికలను వేధించినా, అసభ్యంగా మాట్లాడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రమేష్ హెచ్చరించారు. పాములవాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలికల వేధింపులపై తీసుకునే చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా ఇబ్బంది పెడితే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు చెప్పాలన్నారు. అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: ఓటరు నమోదుపై విద్యార్థులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథం, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఎన్నికల డీటీ కిషోర్ మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటు నమోదు చేయడాన్ని వివరించారు. అధ్యాపకులు మాల్యాద్రి, అప్పలనాయుడు, సుధీర్, సత్యవతి, సూర్యవతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి అనుపు నేడు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక బీసీ కాలనీలో దుర్గామల్లేశ్వర అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని శనివారం అనుపు చేయనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. మండపం వద్ద శుక్రవారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: విశ్వం, కళ్లు కంపౌండ్ 1995, లవ్ రెడ్డి, వీక్షణం, ఆడి2: వెట్టయన్, ఇద్దరు, ఆడి3: దేవర, ఆడి4: రోబోట్, రివైండ్, జనక.. అయితే గనక, రాజు: వెట్టియన్, విశ్వం, బంగార్రాజు: దేవర
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: వేట్టయన్
సాయిలక్ష్మి: విశ్వం, పూర్ణా: దేవర

అ • వీ • ఇ • వీ

ఉపాధ్యాయ హక్కుల సాధనకు కృషి

గొలుగొండ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల హక్కుల సాధనకు అనేక పోరాటాలు చేసిన ఘనత పీఆర్‌టీయూదేనని సంఘ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పాకలపాడు, కొత్తఎల్లవరం, జోగింపేట జడ్పీ పాఠశాలలతో పాటు గురుకుల, కేజీబీవీ ఉపాధ్యాయులను శుక్రవారం కలిశారు. నాయకులు శ్రీరామ్మూర్తి, రమణ, గోవింద తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు విద్య కోసమే వాడాలి

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను విద్య కోసమే వాడాలని గ్రామీణ సీఐ రేవతమ్మ సూచించారు. వేములపూడి హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చాలామంది ట్యాబ్‌లు, సెల్‌ఫోన్లు విద్యకోసం కాకుండా పనికిరాని విషయాలకు ఉపయోగిస్తున్నారన్నారు. ఎస్సై రాజారావు, ప్రధానోపాధ్యాయుడు రమణ పాల్గొన్నారు.



బీసీ వసతిగృహ భవనం మార్పు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాదిలో బీసీ బాలుర వసతిగృహాన్ని మరో భవనంలోకి మార్చారు. ఇప్పటి వరకు చినబజారు వీధిలోని అద్దె భవనంలో ఉండేది. ఇది శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న అద్దె భవనంలోకి వసతిగృహాన్ని మార్చడంతో సమస్య పరిష్కారమైంది.

యువతి అదృశ్యంపై కేసు

రావికమతం: టి.అర్జాపురం శివారు గిరిజన గ్రామానికి చెందిన యువతి (18) కనిపించడం లేదని ఆమె తండ్రి ఫిర్యాదు చేశారని కొత్తకోట ఎస్సై శ్రీనివాసరావు శుక్రవారం చెప్పారు. కొద్ది రోజులుగా రావికమతంలో టైలరింగ్ శిక్షణకు వెళ్తూ ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు.

మద్యం ధరలపై నిఘాకు వినతి

మాకవరపాలెం: మద్యంలో నూతన విధానంలో వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించేలా చూడాలని భాజపా నాయకులు అడిగర్ల రాంబాబు అబ్కారీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించే వారిపై నిఘా ఉంచాలని సీఐ సునిల్‌కుమార్‌ను కోరారు. భాజపా మండల అధ్యక్షుడు మర్రినాయుడు, బాబూరావు తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

రావికమతం, న్యూస్‌టుడే: ఆటో ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని ఎస్సై శ్రీనివాసరావు డ్రైవర్లకు సూచించారు. కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన కల్పించారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న వైద్యమిత్రులు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.కనకం శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ నెల 28 వరకు నిరసన కొనసాగిస్తామని, ఆ తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

పట్టణ ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలేందుకు పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా ఉండటమే కారణమవుతోంది. ఖాళీ స్థలాలు దోమల ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. వర్షం పడితే కాలువలు, రోడ్లు ఏకమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పరిసరాల శుభ్రత మాటలకే పరిమితమవుతోంది. సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. స్వచ్ఛ నర్సీపట్నం దిశగా అడుగులు వేస్తున్నారు.

స్వచ్ఛ నర్సీపట్నంకు అడుగులు



వెంకునాయుడుపేటలో మురుగు నిల్వకుండా అభివృద్ధి చేసిన ఖాళీ స్థలం

నర్సీపట్నం, న్యూస్‌టుడే

పురపాలక సంఘం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను వాటి యజమానులు దశాబ్దాలుగా పట్టించుకోకుండా వదిలేశారు. చుట్టుపక్కల ఇళ్ల నుంచి మురుగు నీరంతా చేరి ఖాళీ స్థలాలు తటాకాలుగా దర్శనమిస్తున్నాయి. దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. ఖాళీ స్థలాలను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు మున్సిపల్ యంత్రాంగం దృష్టిసారించింది. ఏళ్ల తరబడి అభివృద్ధి చేయకుండా వదిలేసిన స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తోంది.



శారదానగర్‌లోని నివాసాల మధ్య మురుగు తటాకం

"నర్సీపట్నంలో శారదానగర్, వెంకునాయుడుపేట, శివపురం, బొంతువీధి, రామారావుపేటలో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి."

ఆక్రమణలు తొలగిస్తాం



పట్టణంలో కాలువలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగిస్తాం. వర్షం కురిస్తే రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడతాం. కాలువల్లో పూడిక పేరుకుపోకుండా చూస్తాం.
– సత్యనారాయణ, పట్టణ ప్రణాళికాధికారి

బోర్డుల ఏర్పాటు

« నోటీసులు జారీ చేయడంతో పాటు ఆయా స్థలాలు పురపాలక సంఘం స్వాధీనంలో ఉన్నాయంటూ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కొందరు స్పందించి తమ స్థలాలను బాగు చేసి గ్రావెల్‌తో చదును చేయించారు. మిగతా స్థలాల విషయంలో ఎలా ముందుకు వెళ్లాలనేది అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. ఆయా స్థలాలను మున్సిపాలిటీయే అభివృద్ధి చేసి అందుకయ్యే ఖర్చును సంబంధిత యజమానుల నుంచి వసూలు చేస్తే ఎలా ఉంటుందనేది ఆలోచన చేస్తున్నారు. ఈ ప్రతిపాదనపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది.

అనంత విజ్ఞాన వలయం.. అంతర్జాలం

'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీలో విద్యార్థుల సత్తా

అంతర్జాలంతో ప్రయోజనాలతో పాటు దుష్ఫలితాలూ ఉన్నాయని విద్యార్థులు పేర్కొన్నారు. మానవాళికి ఎనలేని విజ్ఞానాన్ని అందించే ఇంటర్‌నెట్ అదే స్థాయిలో వినాశనానికీ కారణమవుతోందన్నారు. నర్సీపట్నం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (ముస్లిం బడి)లో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా వ్యాసరచన పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన పోటీలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఆంగ్ల మాధ్యమానికి చెందిన వారు పది మంది ఉన్నారు. విశ్వాన్ని అరచేతిలోకి తీసుకొచ్చిన సాంకేతిక విప్లవాత్మక ప్రగతి మార్పులకు నాంది పలికిందని తమ రచనల్లో పేర్కొన్నారు. సమాచార గోప్యత కొరవడటం, తప్పుడు ప్రచారాలు, సైబర్ నేరాలు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అవగాహనతో అడ్డుకట్ట వేస్తే సమాజానికి మరింత మేలు జరుగుతుందన్నారు. పోటీలకు పర్యవేక్షకులుగా ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుగుణ, ప్రకాష్ వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన మోటమర్రి లాస్యశ్రీ, వి.శాంతి సిరివల్లి, ఆర్.ఎల్లేశ్వరికి ప్రధానోపాధ్యాయుడు కె.వి.రమణ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం



వ్యాసరచన పోటీకి హాజరైన విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం కేవీ రమణ

ఉద్యోగాలకు 60 మంది ఎంపిక

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఏబీఎం కళాశాలలో శుక్రవారం ఏర్పాటైన జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 60 మంది ఎంపికయ్యారు. నర్సీపట్నం చుట్టుపక్కల మండలాల నుంచి 125 మంది హాజరు కాగా ఐదు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ ప్రతినిధి రితీష్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కల్పనాధికారి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నిలకడగా పెద్దేరు నీటిమట్టం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దేరు జలాశయం నీటిమట్టం నిలకడగా ఉందని జలాశయం పర్యవేక్షణ అధికారి సుధాకర్‌రెడ్డి చెప్పారు. ఎగువ ప్రాంతాల నుంచి 140 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. అంతే పరిమాణంలో రాచకట్టు, ఆర్‌ఎంసీ కాలువకు విడుదల చేస్తున్నామన్నారు. జలాశయంలో ప్రస్తుతం 136.40 క్యూసెక్కుల నీరుందన్నారు.

సాగునీటి కాలువ కబ్జాపై ఫిర్యాదు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లి మండలం ఎం.అలమండ, కె.కోటపాడు మండలం ఎం.భీమవరం గ్రామాలకు చెందిన సుమారు 70 ఎకరాలకు సాగునీరందించే కాలువను ఓ వ్యక్తి కబ్జా చేసి మొక్కలు పెంచుతున్నారని బాధిత రైతులు తహసీల్దారు లక్ష్మీదేవి, జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. తెదేపా మండల నాయకులతో కలిసి శుక్రవారం వారంతా రెవెన్యూ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌ను కలిశారు. అనంతరం మాట్లాడుతూ.. రైవాడ జలాశయం ద్వారా మేడిచర్ల బ్రాంచి కెనాల్ నుంచి కామిరెడ్డి మోద (పిల్ల కాలువ) మీదుగా ఎం.అలమండ, ఎ.భీమవరం గ్రామాల్లో 70 ఎకరాలకు సాగునీరందాలి. పిల్ల కాలువలోని కొంత భాగాన్ని ఎం.అలమండకు చెందిన ఓ రైతు కబ్జా చేసి మొక్కలు పెంచుతున్నారని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో తెదేపా మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, నాయకులు పోతల పాత్రునాయుడు, కొమార బాబూరావు, ప్రసాదరావు, నాగేశ్వరరావు, గంగునాయుడు, అబద్ధం, ముత్యాలనాయుడు ఉన్నారు.



తహసీల్దారు లక్ష్మీదేవికి ఫిర్యాదు చేస్తున్న రైతులు, తెదేపా నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే రాజు జన్మదిన వేడుకలు

రావికమతం, బుచ్చెయ్యపేట, చోడవరం, రోలుగుంట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తెదేపా రావికమతం మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, మర్రివలస సర్పంచి పాత్రుడు, నాయకులు శ్రీను, వెంకటాచారి, గోవిందరావు ఎమ్మెల్యే రాజుకు విజయవాడలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రొంగలి రమణ, చంద్రమౌళి, దొడ్డి కిషోర్, రాజాన నాయుడు, కోట గోవింద, జనసేన నాయకుడు సిరిపురపు రమేష్ సమక్షంలో ఎమ్మెల్యే రాజు కేకు కోశారు. వడ్డాది పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పట్టణ తెదేపా అధ్యక్షుడు దొండా నరేష్, నాయకులు గిరిబాబు, శంకర్, రమేష్ పాల్గొన్నారు. చోడవరం ప్రేమ సమాజంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచారు. ద్వారకానగర్‌లో కేకు కోశారు. రోలుగుంట, జె.పి.అగ్రహారం, కుసర్లపూడి, కొవ్వూరులో కేకు కోసి చిన్నారులకు మిఠాయిలు పంచారు.





చోడవరం ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ, విజయవాడలో ఎమ్మెల్యే రాజుతో తెదేపా నాయకులు

వస్త్రం చుట్టి.. వడకట్టి!



చీడికాడ మండలం కోనాం పంచాయతీ కొండ్లకొత్తూరులో కొత్తగా నిర్మించిన రక్షిత తాగు నీటి పథకం వినియోగంలోకి రాలేదు. చినకోనాం నుంచి పైపులైన్ ద్వారా గ్రామానికి నీటిని సరఫరా చేస్తున్నారు. పైపులు శిథిలం కావడంతో కుళాయిలు సక్రమంగా రావడం లేదు. స్థానికులంతా తాగునీటి అవసరాల కోసం గ్రామంలోని రెండు చేతిబోర్లపైనే ఆధారపడుతున్నారు. వాటిలో ఒక బోరు నుంచి నీటితోపాటు ఇసుక రేణువులు వస్తున్నాయి. నీటిని వడపోస్తే తప్ప తాగలేని పరిస్థితి ఉండటంతో.. మహిళలు బోరుకే వస్త్రం చుట్టి ఇలా వడకడుతున్నారు. – న్యూస్‌టుడే, చీడికాడ

కూటమి ప్రభుత్వంలో రహదారులకు మహర్దశ



గింజర్తిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

గొలుగొండ, కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: కూటమి సర్కారు పాలనలో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లకూ మహర్దశ పట్టనుందని జడ్పీటీసీ మాజీ సభ్యులు తారకవేణుగోపాల్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో శుక్రవారం లింగంపేట, గుండుపాల, గింజర్తి, లింగందొరపాలెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచులు రాంబాబు, గోపాలకృష్ణ, నాయకులు రవివర్మ, అప్పలనాయుడు, ప్రసాద్, సత్యనారాయణ, సీతారామ్మూర్తి, ఆనంద్ పాల్గొన్నారు.

నాతవరం: నాతవరం, మర్రిపాలెం, యర్రవరం, ఎంబీ.పట్నం, చెర్లోపాలెం గ్రామాల్లో రూ.7 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ ప్రారంభించారు. తెదేపా మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నాయకులు కొండబాబు, కుమార్, మరిడియ్య, మాణిక్యం పాల్గొన్నారు.

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ధర్మసాగరంలో రూ.55 లక్షల అంచనాతో సిమెంట్, తారు రోడ్డు నిర్మాణానికి జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ శంకుస్థాపన చేశారు. తెదేపా సీనియర్ నాయకుడు బోళెం రామప్రసాద్, సర్పంచి కన్నయ్య నాయుడు పాల్గొన్నారు. అమలాపురం శివారు లింగాలపాలెంలోనూ రహదారి పనులను ప్రారంభించారు.



అమలాపురంలో రోడ్డు పనుల శంకుస్థాపనలో జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ తదితరులు

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: పంచాయతీ పాలకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎంపీడీఓ సాంబశివరావు సూచించారు. మండలంలోని 32 పంచాయతీలకు చెందిన ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. మండల పరిషత్తు కార్యాలయ సూపరింటెండెంట్ అప్పలరాజు, ఈవోఆర్డీ రమణి పాల్గొన్నారు.

పల్లె పండగలో నేడు..

చోడవరం, న్యూస్‌టుడే: మండలంలోని 25 గ్రామాల్లో శనివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెదేపా మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ చెప్పారు. ఉదయం 8 గంటలకు గంధవరంలో ప్రారంభమై రాత్రి 8.30 గంటలకు కన్నంపాలెంలో ముగుస్తుందన్నారు.

మాడుగుల గ్రామీణం: మండలంలోని గాదిరాయి, ఒమ్మలిలో ఉదయం, సత్యవరం, వీరనారాయణంలో మధ్యాహ్నం పల్లె పండగ కార్యక్రమం జరుగుతుందని తెదేపా మండల అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు చెప్పారు.

డిసెంబరులోగా అసంపూర్తి పనుల పూర్తి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మన బడి- మన భవిష్యత్తు కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందని వసతుల కల్పన రాష్ట్ర సమన్వయకర్త నాగేశ్వరరావు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిన పనులను డిసెంబరు నెలాఖారులోగా పూర్తి చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన పాఠశాల అభివృద్ధి కమిటీలు, ప్రధానోపాధ్యాయుడి సంయుక్త పర్యవేక్షణలో ఈ పనులను జరుగుతాయన్నారు. దేవరాపల్లి మండలంలోని కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాశీపురం, ఎ.కొత్తపల్లి తదితర పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఎ.కొత్తపల్లి, కాశీపురం జడ్పీ పాఠశాలల్లో మైదానాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సువర్ణరాజుకు సూచించారు. మండల రిసోర్సు భవనాన్ని పరిశీలించిన ఆయన నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. సర్వశిక్షా మండల ఇంజినీరు సంతోష్‌కుమార్, అకౌంటెంటు శ్రీను, సీఆర్పీ గంగాధరరావు పాల్గొన్నారు.



కేజీబీవీ ప్రిన్సిపల్ భువనమాధురితో మాట్లాడుతున్న సమన్వయకర్త నాగేశ్వరరావు

స్మార్ట్ మీటర్లు వద్దు



ఈఈకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నర్సీపట్నం అర్బన్: విద్యుత్తు స్మార్ట్ మీటర్లు బిగించాలన్న నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పెదబొడ్డేపల్లిలోని ఉప కేంద్రం వద్ద సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ ఇంధనం, ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం వినియోగదారులపై భారం మోపుతోందన్నారు. అనంతరం ఈఈకి వినతిపత్రం అందజేశారు. చిరంజీవి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు, దేవరాపల్లి: విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలని డిమాండు చేస్తూ ఎ.కోడూరులో సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, వనుం సూర్యనారాయణ, రామన్న, గంగునాయుడు ఆందోళన చేపట్టారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్తు వినియోగదారులపై బిల్లుల భారం పెరుగుతుందని సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర ఆందోళన వ్యక్తం చేశారు. వాలాబు పంచాయతీలో గిరిజనులతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. ఈశ్వరరావు, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



భూసమస్యను పరిష్కరించాలంటూ డీటీకి వినతిపత్రం ఇస్తున్న రైతు

రీసర్వే సమస్యలకు పరిష్కారం

మాకవరపాలెం, నాతవరం, న్యూస్‌టుడే: రీసర్వేలో భూముల వివరాలు సక్రమంగా లేని రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఉప తహసీల్దారు సోమశేఖర్ సూచించారు. పెద్దిపాలెంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. నాతవరం మండలం గుమ్ముడుగొండ, చినజగ్గంపేట గ్రామాల్లో భూ సంబంధ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దారు వేణుగోపాల్ చెప్పారు. డీటీ శివ, సర్వేయర్ ప్రసాద్, వీఆర్వో బాబు పాల్గొన్నారు.

రావికమతం: గుమ్మళ్లపాడు, చినపాచిల గ్రామాల్లో భూసంబంధ సమస్యలపై తహసీల్దారు వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది రైతుల నుంచి వినతులు స్వీకరించారు. విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు సరిచేయాలని ఎక్కువ మంది విన్నవించారు. ఆర్ఐ సతీష్, వీఆర్వోలు మూర్తి, శ్రీనివాస్, బాలాజీ, చినపాచిల, గుమ్మళ్లపాడు సర్పంచులు పాల్గొన్నారు.

తెదేపా బలోపేతానికి కలిసి పనిచేస్తాం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావుతో ఎలాంటి విభేదాల్లేవని తెదేపా మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ పేర్కొన్నారు. ఎన్నిలకు ముందు తెదేపాలో చేరిన భాస్కరరావుతో సఖ్యత లేదన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. రైవాడ అతిథిగృహం ఆవరణలో ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ తెదేపా బలోపేతానికి కలిసి పనిచేస్తామన్నారు. మండల ప్రధాన కార్యదర్శి కళ్లాన సూర్యనారాయణ, నాయకులు పోతల పాత్రునాయుడు, సోమిరెడ్డి గోవింద, మొల్లి కృష్ణమూర్తి, మహేశ్వరీనాయుడు, చల్లా నానాజీ, శ్రీను పాల్గొన్నారు.



రైవాడ అతిథిగృహ ఆవరణలో నాయకులతో సూర్యనారాయణ

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

చోడవరం, న్యూస్‌టుడే

సమస్య: స్వయంభూ గౌరీశ్వరాలయానికి వెళ్లే దారిలో సింహద్వారం వద్ద కల్వర్టు దెబ్బతిని పెద్ద గొయ్యి పడింది. మురుగు నీటిలో నుంచే ఆలయానికి వెళ్లాల్సి వస్తోంది. బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్లే దారంతా తుప్పలతో నిండింది. - సత్యనారాయణ, చోడవరం



★ శివాలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్లే దారులను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే

సమస్య: కొత్తమల్లంపేట, ఏఎల్‌పురం, అమ్మపేట, చోద్యం, చిన్నయ్యపాలెం గ్రామాల్లో వీధికుక్కల సమస్య అధికంగా ఉంది. రాకపోకలు సాగించే క్రమంలో వాహన చోదకులను వెంబడిస్తున్నాయి.
– సుదర్శన్, అమ్మపేట

★ సమస్య పరిష్కారానికి పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేస్తాం.
– ఎంపీడీవో, గొలుగొండ



స్పందనకు వందనం

చెత్త సమస్యకు పరిష్కారం

గొలుగొండ, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ ఎ.ఎల్.పురంలో ప్రతీ సోమవారం జరిగే వారపు సంతకు చెత్తతో సమస్య వచ్చేది. దీంతో రైతులతోపాటు చిరు వ్యాపారులు తమ ఉత్పత్తులు అమ్మకాలు చేసే చోట శుభ్రత లేక ఇబ్బందులు పడేవారు. దీనిపై ఈ నెల 15 'సంత.. చెత్తతో చింత' శీర్షికన 'ఈనాడు'లో వార్తా కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య కార్మికుల సాయంతో చెత్తను తొలగించారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: వనుగుమ్మ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.సత్యం (55) శుక్రవారం ఉదయం ముంచంగిపుట్టులో మృతి చెందారు. చీడికాడ మండలం ఖండివరం గ్రామానికి చెందిన ఆయన గురువారం సాయంత్రం వనుగుమ్మ వెళ్లేందుకు ముంచంగిపుట్టులో వాహనాల కోసం వేచి ఉన్నారు. వాహనాల్లేక ముంచంగిపుట్టులోని దుకాణ సముదాయాల వద్దే రాత్రంతా ఉండిపోయారు. అనారోగ్యంతో ఉన్న ఆయన శుక్రవారం ఉదయం చనిపోయారని ఎంఈఓ కృష్ణమూర్తి తెలిపారు. దూరప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చి విద్యను బోధించిన ఉపాధ్యాయుడు సత్యం మృతికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీఆర్పీలు సంతాపం తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో ఉంచిన మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ మండలం అమ్మపేటలో తాగునీటి ట్యాంకులను పంచాయతీ సిబ్బంది శుక్రవారం క్లోరినేషన్ చేశారు. కొద్ది రోజులుగా వీధి కుళాయిల నుంచి కలుషిత నీరు వస్తోందని గ్రామస్థులు ఆందోళన చేయడంతో పంచాయతీ కార్యదర్శి స్పందించారు. సిబ్బందితో ట్యాంకును శుభ్రం చేయించారు.

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో విద్యుదుత్పత్తి పునఃప్రారంభం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో విద్యుదుత్పత్తి పునఃప్రారంభించారు. 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లో బాయిలర్ ట్యూబులకు లీకేజీలు ఏర్పడడంతో బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో సంస్థ అధికారులు విద్యుదుత్పత్తిని నిలుపుదల చేసిన సంగతి తెలిసిందే. సంస్థ ఉద్యోగులు, కార్మికులు శ్రమించి బాయిలర్ ట్యూబుల లీకేజీలకు మరమ్మతులు పూర్తి చేసి ఉత్పత్తిని పునఃప్రారంభించారు. ప్రస్తుతం 1, 2, 3, 4 యూనిట్లలో ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతోంది.

అ వీ ఇ వీ


సింహగిరి మాడవీధుల్లో ఊరేగింపు

వైభవంగా తులా సంక్రమణ తిరువీధి

సింహాచలం, న్యూస్‌టుడే: తులా సంక్రమణ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి తిరువీధి ఉత్సవం సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీలో అధిష్ఠింపజేశారు. పండితులు వేద పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తులను సింహగిరి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు తిరువీధులలో స్వామిని దర్శించుకుని గోవింద నామ స్మరణ చేశారు.


కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం శుక్రవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ బేడా మండపంలోని వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

వేట సాగక.. పూట గడవక..

వరుస వాయు గుండాలు, తుపానులతో మత్స్యకారుల అవస్థలు


ముత్యాలమ్మపాలెంలో తీరానికే పరిమితమైన బోట్లు

పరవాడ, న్యూస్‌టుడే

కడలిని నమ్ముకుని బతుకు నావను నెట్టుకొస్తున్న గంగపుత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సముద్రం ప్రశాంతంగా ఉంటేనే వేటకు వెళ్తేది.. కుటుంబం సాగేది.. లేకుంటే పస్తులుండాల్సిందే. చేపలవేట నిషేధం అనంతరం జూన్ 14 నుంచి వేట పునఃప్రారంభమైనప్పటి నుంచి వీరికి ఏ మాత్రం కలిసి రావడం లేదు. సముద్ర కల్లోలం కారణంగా వలలకు సరిగా చేపలు చిక్కక ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులకు వరుస వాయుగుండాలు, తుపానులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. తుపాను హెచ్చరికలతో వారాల తరబడి ఇంటికే పరిమితమవుతున్నారు. చేపల వేట తప్ప మరో వృత్తి తెలియని మత్స్యకారులు గత్యంతరం లేక అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

గత ప్రభుత్వం హామీలు ఇచ్చి విస్మరించడంతో..

పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ మత్స్యకార గ్రామం. ఇందులో దిబ్బపాలెం, జాలారిపేట శివారు పల్లెలు ఉన్నాయి. ఇక్కడ 8 వేలకు పైగా ఉన్న జనాభాకు చేపల వేటే ప్రధాన ఆధారం. వైకాపా ప్రభుత్వంలో చాలావరకు వీరికి రాయితీ పథకాలు అందలేదు. తీరంలో జెట్టీ నిర్మిస్తామని, వసతులు కల్పించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని వైకాపా ప్రభుత్వం గతంలో ప్రకటించినా అవి ఏమాత్రం కార్యరూపం దాల్చలేదు. ఈ ఏడాది వేట నిషేధ పరిహారం అందక ఇక్కట్లు పడుతున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం(2014-19) హయాంలో రాయితీపై ఇచ్చిన వలలు, ఐస్‌బాక్స్‌లు, మోటారు సైకిళ్లు, ఇంజిన్లు, బోట్లతోనే ఇప్పటికీ నెట్టుకొస్తున్నామని వారంతా చెబుతున్నారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ వ్యర్థ జలాలు తీరంలో కలవడం వల్ల మత్స్య సంపద నశించి వేట సాగడం లేదని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పోషణ సైతం భారంగా మారిందని చెబుతున్నారు. ఫార్మాసిటీలో 500, ఎన్టీపీసీలో 60 ఉద్యోగాలు కల్పిస్తామని జిల్లా ఉన్నతాధికారులు గతంలో ఒప్పందం చేసినా ఇప్పటికే వాటిని అమలు చేయలేదని వాపోతున్నారు. తీరంలో జెట్టీ లేకపోవడంతో బోట్లు, సామాగ్రికి రక్షణ లేకుండా పోయింది. వేటకు వెళ్లే ప్రతిసారి బోట్లు, వలలు, ఇంజిన్లను సముద్రంలోకి కర్రలతో మోసుకెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జెట్టీ నిర్మించి కష్టాలు తీర్చాలి..



జెట్టీ లేకపోవడంతో కష్టాలు తప్పడం లేదు. బోట్లు మోయడంతో వెన్నునొప్పి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. రాయితీ పథకాలు అందడం లేదు. తుపానుల సమయంలో బోట్లు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. వరస తుపానులతో ఈ ఏడాది అసలు చేపల వేట కలిసి రాలేదు. కుటుంబ జీవనం కష్టంగా మారింది. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలి.
– మేరుగు కొర్లయ్య, మత్స్యకారుడు, ముత్యాలమ్మపాలెం


వలలకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

అప్పులు పాలవుతున్నాం..



తుపానులు, వాయుగుండాలతో వేట లేక ఇంటిపట్టునే ఉంటున్నాం. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. ఇంధనం, మరమ్మతుల ఖర్చులు బాగా పెరిగిపోయాయి. ఈ ఏడాది వేట నిషేధ పరిహారం కూడా అందలేదు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీలో ఇస్తామని చెప్పిన ఉద్యోగాలు కూడా ఇప్పటివరకు ఇవ్వలేదు. తమకు కంపెనీల్లో ఉపాధి కల్పించి న్యాయం చేయాలి.
– తిత్తి దేముడు, మత్స్యకారుడు, ముత్యాలమ్మపాలెం

మునగలో మేలైన పోషకాలు

సరిపల్లి(పెందుర్తి), న్యూస్‌టుడే: మునగతో మహిళలు, చిన్నారులకు మేలైన పోషకాలు లభిస్తాయని ఐసీడీఎస్ పీడీ జయదేవి పేర్కొన్నారు. సామాజిక వేడుకలో భాగంగా శుక్రవారం పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'మునగచెట్టు మహిళల ఆరోగ్యానికి తొలిమెట్టు' కార్యక్రమం నిర్వహించారు. జయదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మునగలోని పోషకాలను మహిళలకు వివరించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద మునగ చెట్టు పెంచాలని సూచించారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారిణి శారద, పెందుర్తి సీడీపీవో నీలవేణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు డి.మానస, ఎంఎస్‌కే ఉష, అంగన్‌వాడీ కార్యకర్త ఎల్.రామలక్ష్మి లబ్ధిదారులు పాల్గొన్నారు.


గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ పీడీ జయదేవి, తదితరులు

శ్రీనివాసుడికి స్నపన తిరుమంజనం

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన కలియుగ దైవం వేంకటేశ్వర స్వామికి శుక్రవారం విశేష స్నపన తిరుమంజనం వైభవోపేతంగా జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. వేద మంత్రోచ్చారణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలు, ఫలోదకాలతో శ్రీనివాసుడికి స్నపన తిరుమంజనం సంప్రదాయబద్ధంగా జరిపించారు. నూతన వస్త్రాలు అలంకరించి ధూపదీప సేవలతో కొలిచారు. భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


శ్రీవారికి తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకుడు

ఏపీసీ మృతి బాధాకరం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటరు(ఏపీసీ)గా సేవలందించిన బి.శ్రీనివాసరావు మృతి చాలా బాధాకరమని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం జిల్లా డీపీఓగా బదిలీపై వెళ్లి గురువారం ఆయన గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. శ్రీనివాసరావు మృతి పట్ల శుక్రవారం కలెక్టరేట్ జరిగిన సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఇతర అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు.

విశ్లేషించి.. ప్రతిభ చూపించి..


వ్యాసరచన పోటీలో పాల్గొన్న చినముషిడివాడ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు, విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ పి.రాజేశ్వరి, ఉపాధ్యాయులు

'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం చినముషిడివాడ, సుజాతనగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ జరిపారు. ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ★ చినముషిడివాడ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు జి.శ్రావణి, ఆర్.షర్మిల, పి.అఖిల్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ పి.రాజేశ్వరి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ★ సుజాతనగర్ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో జి.దీపిక, సీహెచ్.యశ్వ ప్రదీప్‌సాయి, ఎంవీ.సొహైల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయిని ఎన్.రమాదేవి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, పెందుర్తి


సుజాతనగర్ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో..; గెలుపొందిన వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసిన ప్రధానోపాధ్యాయిని రమాదేవి, ఉపాధ్యాయులు

పీఎంశ్రీ హైస్కూళ్లు ఉన్నత శ్రేణిలో రాణింపు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకంలో సీబీఎస్సీ సిలబస్‌తో నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాలలు రానున్న కాలంలో అన్నిరకాల హంగులతో ఉత్తమశ్రేణి విద్యాసంస్థలుగా అభివృద్ధి చెందుతాయని భీమిలి డైట్ కళాశాల ప్రధానాచార్యులు ఎం.జ్యోతికుమారి పేర్కొన్నారు. ఈమేరకు పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు భీమిలి డైట్ కళాశాల ప్రాంగణంలో సమగ్ర శిక్షా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ అంశాల్లో జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆమె ప్రారంభించి ప్రసంగించారు. నాలుగు విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీల్లో వక్తృత్వ పోటీలో పెందుర్తి ప్రభుత్వ హైస్కూలు(విన్నర్స్), ఆర్.వి.పురం జెడ్పీ హైస్కూలు(రన్నర్స్)గా నిలిచాయి. డిజిటల్ క్వెస్ట్ పోటీలో పెందుర్తి జెడ్పీ హైస్కూలు(విన్నర్స్), ఆనందపురం జెడ్పీ హైస్కూలు(రన్నర్స్), క్విజ్ పోటీలో ఆనందపురం జెడ్పీ హైస్కూలు(విన్నర్స్), చిట్టివలస జెడ్పీ హైస్కూలు(రన్నర్స్), డిస్కవర్, లెర్నింగ్ లోకల్ సైట్స్ పోటీలో చిట్టివలస జెడ్పీ హైస్కూలు(విన్నర్స్), పెందుర్తి ప్రభుత్వ హైస్కూలు(రన్నర్స్)గా నిలిచాయి. జిల్లాస్థాయిలో ఎంపికైన ఈ విజేత పాఠశాలల జట్లు ఈనెల 21 నుంచి 23 తేదీల మధ్య విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని సమగ్రశిక్షా పథకం అకడమిక్ మోనటరింగ్ అధికారి జి.లక్ష్మి పేర్కొన్నారు.

ప్రణాళికతో మోనోపాజ్‌ను ఎదుర్కోవచ్చు

పాపయ్యరాజుపాలెం(పెందుర్తి), న్యూస్‌టుడే: మహిళలు మోనోపాజ్ దశ నుంచి భయపడకుండా ప్రణాళికతో ఎదుర్కోవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మానస సూచించారు. పెందుర్తి ఐసీడీఎస్, వాసవ్య మహిళా మండలి, విప్రోకేర్ కుశల్ మెటర్నిటీ హెల్త్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పాపయ్యరాజుపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మోనోపాజ్, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ ఆహార అలవాట్లు, జీవనశైలి మార్పుల ద్వారా మహిళలు ఆయా సమస్యలను అధిగమించవచ్చునన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.లక్ష్మి, మహిళా పోలీసు రత్నం, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశా కార్యకర్త రమణి, అంగన్‌వాడీ కార్యకర్త బి.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న నిర్వాహకులు, వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది

చురుగ్గా ఆలయ అభివృద్ధి పనులు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట పరిసర 14 గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం నర్శింగ బిల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారి గర్భగుడి చుట్టూ ఖాళీ ప్రదేశంలో స్లాబు నిర్మాణం చేశారు. కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధ్వర్యంలో గ్రామపెద్దలు ముత్తానాయుడు, మాజీ సర్పంచి బల్ల రాంబాబు, శేశెట్టి అప్పారావు, యర్రా నాగరాజు, మహేశ్, వాసురాజు తదితరులు దగ్గరుండి పనులు పూర్తి చేయించారు. దాతల సహాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కార్పొరేటర్ రాపర్తి కన్నా తెలిపారు.


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాపర్తి కన్నా, ముత్తానాయుడు, బల్ల రాంబాబు తదితరులు

నేడు ఎమ్మెల్యే పంచకర్ల పర్యటన

పరవాడ, న్యూస్‌టుడే: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో శనివారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పర్యటించనున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రూ.కోటి వెచ్చించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, రావాడ, కలపాక, గొర్లెవానిపాలెం, ఈ.భోనంగి పంచాయతీల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆధునిక సాంకేతికతతో మెరుగైన ఉపాధి అవకాశాలు



సదస్సులో మాట్లాడుతున్న వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్సు (డీఎస్) తదితర సాంకేతికతలతో భారీ వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏఐసీటీఈ-వైబ్రెంట్ ఎడ్వకసీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (వాణి) సహకారంతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఏఐ, ఎం.ఎల్, డి.ఎస్'పై తెలుగులో నిర్వహించిన చర్చా వేదికను ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ 2026 నాటికి వీటి అనువర్తనాలను 75 శాతం పైగా వినియోగిస్తారన్నారు. లక్షలాది ఉపాధి అవకాశాలను సృష్టించే శక్తి వీటికి ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని దేశ, విదేశీ నిపుణులతో ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు నూతన సాంకేతికతలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీఎస్ఈ విభాగం ఆచార్యులు ఆచార్య ఎం.శశి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే వీటిని బోధించాల్సిన అవసరముందన్నారు. ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతికతను స్థానిక భాషతో అనుసంధానించడంతో మెరుగైన అవగాహన కలుగుతుందన్నారు. సీఎస్ఈ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు, చర్చా వేదిక సహ సమన్వయకర్త ఆచార్య ఎం.రాంజీ తదితరులు మాట్లాడారు. అనంతరం అమెరికా నుంచి ఏఐ సాంకేతిక భవిష్యత్తు అంశంపై సునీల్ ఎస్ రంక, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ రవి ఈశ్వరపు, న్యూరల్ నెట్ వర్క్స్‌పై విజయ్ ప్రసంగించారు. కార్యక్రమం తెలుగులో నిర్వహించడంతో ఆచార్యులు తెలుగులో ఉపన్యాసం చేసేందుకు ఇబ్బందులు పడ్డారు.

పల్లెలకు నిజమైన పండగ: ఎమ్మెల్యే


గుల్లేపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, స్థానిక నేతలు

సబ్బవరం, న్యూస్‌టుడే: గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పల్లెలకు నిజమైన పండగొచ్చిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అన్నారు. సబ్బవరం మండలంలోని తవ్వవానిపాలెం, అమృతపురం, పెదగొల్లలపాలెం, బాట జంగాలపాలెం, అసకపల్లి, సబ్బవరం-1, 2, 3, సచివాలయాలు, బోదువలస, ఎల్లుప్పి మర్రిపాలెం, ఎల్లుప్పి గ్రామాల్లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. జిల్లా డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పి.పద్మజ, తహసీల్దారు బి.చిన్నికృష్ణ, నేతలు బోకం స్వామినాయుడు, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, పడాల వెంకటరమణ, పి.శ్రీను, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, ఉగ్గిన రాము, సాలాపు వెంకటేశ్వరరావు, ఇందల రమణ, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలంలో జరుగుతున్న పల్లె పండగ - గ్రామ పంచాయతీల వారోత్సవాల్లో భాగంగా జెర్రిపోతులపాలెం గ్రామంలో రూ.22 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి సర్పంచి మడక అప్పలరాజు శుక్రవారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పెందుర్తి మాజీ ఉప ఎంపీపీ మడక పార్వతి, పంచాయతీ కార్యదర్శి శివ, పీఆర్ ఏఈ లక్ష్మణరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


శంకుస్థాపనలో పాల్గొన్న జెర్రిపోతులపాలెం సర్పంచి మడక అప్పలరాజు, తదితరులు

గృహ రుణాలు మంజూరు చేయండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పట్టణ పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలకు సంబంధించి రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలని, ముఖ్యంగా టిడ్కో ఇళ్లకు సంబంధించి రుణాలివ్వాలని అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి కోరారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో యూసీడీ పీడీ సత్యవేణితో కలిసి బ్యాంకర్లతో సమావేశమయ్యారు. మహిళా సంఘాల రుణాలు, మహిళల స్వయం ఉపాధి అంశాలపైనా చర్చించారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని పీడీ సత్యవేణి పేర్కొన్నారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరంలోని సర్వే నెంబరు 449-9లో 6.07 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొంతమంది మొక్కలు నాటి ఆక్రమణలు చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, సబ్బవరం తహసీల్దారు బి.చిన్నికృష్ణ ఆదేశాల మేరకు సబ్బవరం ఆర్ఐ వీరయ్య తన సిబ్బందితో వెళ్లి ఆక్రమణలకు అడ్డుకట్ట వేశారు. ఆక్రమిత ప్రదేశంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

ఇరుకు దారి.. వాహనాలు భారీ



దర్పణం

మండల కేంద్రం పరవాడ నుంచి భరణికం వెళ్లే రహదారిలో ప్రయాణం భయంభయంగా మారింది. ఒకపక్క ఇరుకు రహదారి మరోపక్క భారీ కంటైనర్ లారీలు రాకపోకలు సాగించడంతో తప్పుకోవడానికి స్థలం కూడా సరిపోక వాహనచోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో పాటు చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వస్తున్నాయి. రహదారి అంచులు వెంబడి బెర్మలు కోతకు గురయ్యాయి. ఏమాత్రం అదుపుతప్పినా భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని ద్విచక్ర వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. అనకాపల్లి, పరవాడ, భరణికం, వెంకటాపురం, తోటాడ, మునగపాక ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారి వెంబడి పొదలను తొలగించడంతో పాటు విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పరవాడ

సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యుత్తు ఇంధన సర్దుబాటు పేరుతో వసూలు చేస్తున్న ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ పెందుర్తి జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు పెందుర్తి విద్యుత్తు కార్యాలయం వద్ద ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని నినాదాలు చేశారు. తక్షణమే ఆయా ఛార్జీలను రద్దు చేయకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. పెందుర్తి జోన్ కార్యదర్శి బి.రమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అప్పలనాయుడు, ఈశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యుత్తు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు


కూడలిలో నిలిచిపోయిన వాహనాలు

మొరాయించిన లారీ.. నిలిచిన ట్రాఫిక్

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ పెట్రోలు బంకు కూడలికి సమీపంలో బొగ్గు లారీ మొరాయించింది. లంకెలపాలెం నుంచి అచ్యుతాపురం వైపు వెళ్తున్న బొగ్గు లారీ సరిగా పెట్రోలు బంకు కూడలికి వచ్చేసరికి భారీ లోడు కారణంగా టైర్లలో గాలిపోయి ఒకపక్కకి ఒరిగిపోయింది. అయితే సరిగా గాజువాక, అచ్యుతాపురం, పరవాడ, లంకెలపాలెం వెళ్లే కూడలి కావడంతో వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. లారీ మొరాయించిన కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవడానికి వీలుకాక అవస్థలు పడ్డారు.

తాగునీరు నేలపాలు

పరవాడ, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ పరవాడ బొంకులదిబ్బ వీధిలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పైపులైన్ నుంచి తాగునీరు వృథా అవుతోంది. పైపులైన్ లీకై గత కొద్దిరోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునేవారే కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు. విలువైన తాగునీరు నేలపాలవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటున్న రోడ్డుపైన నీరు పారడంతో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.


పైపులైన్ నుంచి లీకు అవుతున్న నీరు